సాక్షి ప్రకాశం

గురువారం । 16 । మే । 2024



దర్శిలో రౌడీ మూకామేస్త్రీ

ప్రశాంతంగా ఉండే దర్శి నియోజకవర్గంలో పచ్చ మూకా జీభత్సం సృష్టించింది. పోలింగ్ రోజు టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి నానా అల్లర్లు సృష్టించారు. -10లో..



బీభత్సం సృష్టించిన టీడీపీ నేత కారు

అతివేగంగా వెళ్తున్న కారు రోడ్డు పక్కన కల్వర్టు రెయినింగ్ వాల్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న బైక్‌కు తగిలి బీభత్సం సృష్టించింది. -10లో..

గరిష్టం/కనిష్టం 37.7/28.7

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాం

ఒంగోలు: తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించామని మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు మాజీ సైనికులు 200 మందికి దిశ డీఎస్పీ ఒంగోలు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాల్లోని పలు ప్రాంతాల్లో బాధ్యతలు అప్పగించారన్నారు. తమ సంఘ సభ్యులు పనిచేసిన ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించగలగడం తమకు ఆనందంగా ఉందన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్ యంవీ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తు చేసుకోవాలన్నారు. నమోదుకు సంబంధించిన పత్రాలను ప్రింట్ తీసుకోవాలని, జిల్లాలోని ఒకటి కంటే ఎక్కువ ఐటీఐలను కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసిన వారు దరఖాస్తు ప్రింటు కాపీని, ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని ప్రభుత్వ ఐటీఐలలో ఖచ్చితంగా జూన్ 10వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు మొబైల్ నంబర్ 8143130711కు కార్యాలయం పనివేళల్లో సంప్రదించగలరన్నారు.



వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు(ఫైల్)

పొగాకు ధరల పరుగు..

పొగాకు సాగు రైతులకు కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ఈ సీజన్ అమ్మకాలు ప్రారంభ దశలోనే మంచి ధరలు రావడంతో రైతులు లాభాల బాట పడుతున్నారు. అంతర్జాతీయంగా డిమాండ్ ఎక్కువగా ఉండడంతోపాటు, స్థానికంగా వ్యాపారులు పోటీ పడుతుండడం రైతులకు కలిసివస్తోంది. ఫిబ్రవరి మూడో వారంలో అమ్మకాలు ప్రారంభమయ్యాయి. నాణ్యత మెరుగ్గా ఉండడంతో ఈ సీజన్‌లో ప్రారంభ ధర రూ.230 పలుకగా అత్యధికంగా రూ.300లకు చేరింది. వ్యాపారుల మధ్య పోటీ ఎక్కువగా ఉండడంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. రీజియన్ పరిధిలో ప్రస్తుతం 42 మిలియన్ కేజీలు కొనుగోళ్లు అయ్యాయి. గత రెండు సీజన్లలో రైతులకు మంచి రేట్లు రావడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం నాలుగు వేల హెక్టార్లు పెరిగింది.

- ప్రారంభ ధర రూ.230కు తగ్గకుండా సరాసరిన రూ.238 వద్ద కొనుగోళ్లు
- కేజీ పొగాకు గరిష్ట ధర రూ.300
- 130 మిలియన్ కేజీలకు అనుమతి రాగా ఇప్పటికే 42 మిలియన్ కేజీల కొనుగోళ్లు పూర్తి
- పచ్చ, మాడు అనే తేడా లేకుండా లోగ్రేడ్ పొగాకు కూడా కొనుగోళ్లతో రైతుల్లో హర్షాతిరేకాలు
- వరుసగా మూడో ఏడాదీ రైతులకు లాభాల పంట
- ఎకరానికి కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా లాభాలు

చీమకుర్తి: పొగాకు రైతుల పంట పండింది. వరుసగా మూడో ఏడాది కూడా రైతులు పండించిన పొగాకుకు రైతులు ఆశించిన ధరకంటే ఎక్కువగా రావడంతో ఆనందోత్సాహం వ్యక్తమవుతోంది. పొగాకు కొనుగోళ్లు ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రారంభం కాగా మొదటి రోజే కేజీ పొగాకు ధర రూ.230 పలికింది. ప్రారంభ ధరకు తగ్గకుండా గరిష్ఠ ధర కేజీ రూ.300 వరకు, సరాసరి ధర రూ.238.78 పలికినట్లు పొగాకు బోర్డు అధికారులు ధ్రువీకరించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఈ ఏడాది 72 వేల హెక్టార్లలో రైతులు పొగాకు సాగు చేశారు. 130 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతినిచ్చింది. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 11 వేలం కేంద్రాల్లో 42 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యాయి. బ్రైట్ కలర్ పొగాకే కాకుండా పచ్చ, మాడు రంగులోనున్న పొగాకుకి కూడా కేజీ ధర సరాసరిన రూ.250 పలుకుతోంది. దాంతో రైతుల వద్ద నాణ్యమైన పొగాకుతో పాటు మాడు, పచ్చ వంటి లోగ్రేడ్ పొగాకు కూడా మిగలకుండా బయ్యర్లు కొనుగోలు చేస్తుండటంతో వరుసగా మూడో ఏడాది పొగాకు రైతులకు లాభాల పంట పండింది.

4 వేల హెక్టార్లలో సాగు అదనం:
పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటిలో ప్రకాశం జిల్లా పరిధిలో 7 వేలం కేంద్రాలుంటే, జిల్లాలోని కందుకూరులో రెండు, డీసీపల్లి, కలిగిరి వేలం కేంద్రాలున్నాయి. ఈ వేలం కేంద్రాల పరిధిలో 2022–23 ఏడాది పొగాకు సీజన్‌లో వేలంలో రికార్డు ధరలు వచ్చాయి. కేజీ పొగాకు సరాసరిన రూ.214 వరకు ధర పలికింది.

పొగాకు వేలం కేంద్రాల వారీగా కొనుగోళ్లు జరిగిన పొగాకు పరిమాణం, సరాసరి ధర వివరాలు పట్టిక రూపంలో ఈ విధంగా ఉన్నాయి.

ప్లాట్‌ఫారం పేరు	పొగాకు/ మి.కేజీలు	సరాసరి ధర
ఒంగోలు–1	5.49	రూ.241.28
వెల్లంపల్లి–2	4.02	రూ.244.22
ఒంగోలు–2	4.70	రూ.238.52
టంగుటూరు–1	4.91	రూ.236.20
కొండపి	5.11	రూ.237.36
మొత్తం	24.23	రూ.239.37
పొదిలి–1	3.69	రూ.249.72
కనిగిరి	2.50	రూ.236.85
కందుకూరు–1	5.06	రూ.240.12
కందుకూరు–2	4.65	రూ.241.04
కలిగిరి	2.81	రూ.239.73
డీసీ పల్లి	4.05	రూ.243.12
మొత్తం	22.76	రూ.240.87

దీంతో రైతులకు గత సీజన్ సిరులు కురిపించింది. ఈ నేపథ్యంలో 2023–24 ఏడాదిలో కూడా పొగాకు పంట భారీగా సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగానే 11 వేలం కేంద్రాల పరిధిలో దాదాపు 72 వేల హెక్టార్లలో పొగాకు పంట సాగైంది. 2022–23 ఏడాదిలో 68 వేల హెక్టార్ల సాగు ఉంటే ఇది ప్రస్తుతం 72 వేల హెక్టార్లకు పెరిగింది. గతేడాది కంటే దాదాపు 4 వేల హెక్టార్లలో ఎక్కువగా సాగైంది. గతేడాది వచ్చిన లాభాలకు తోడు ఈ ఏడాది ఇతర పంటల సాగుకు వాతావరణం అంత అనుకూలంగా లేకపోవడం కూడా పొగాకు సాగు పెరగడానికి కారణమని బోర్డు అధికారులు చెప్తున్నారు.

ఒక్కో ఎకరానికి రూ.లక్ష పైనే లాభం:
ఈ ఏడాది 72 వేల హెక్టార్ల విస్తీర్ణంలో 23,930 బ్యారన్ల ద్వారా 30 వేల మంది రైతులు పొగాకు సాగు చేసినట్లు బోర్డు అధికారుల అంచనా. ఒక్కో రైతు తన సొంత బ్యారన్‌తో పాటు మరో రెండు మూడు బ్యారన్‌లను కూడా అద్దెకు తీసుకొని పొగాకు సాగు చేశారు. గత రెండు విడతలుగా పొగాకులో మంచి లాభాలు రావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. రైతుల అంచనాలు వమ్ము కాకుండా వరుసగా మూడో ఏడాది కూడా ఇప్పుడు లాభాలు రావడంతో ఒక్కో ఎకరానికి రూ.1 లక్షకు తగ్గకుండా లాభాలు వస్తున్నాయని అధికారులే స్పష్టం చేస్తున్నారు. నాణ్యత సైతం మెరుగ్గా ఉండడంతో రైతులు లాభాలపై మరింత ఆశలు పెట్టుకున్నారు. క్యూరింగ్‌లో దాదాపు 70 శాతం పొగాకు బ్రైట్ గ్రేడ్ దిగుబడి వస్తుండగా, 20 శాతం వరకు లోగ్రేడ్, మిగిలినవి ఇతర గ్రేడ్‌లు వస్తున్నాయని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. గత సీజన్‌లో బోర్డు అనుమతిని మించి దాదాపు 123.10 మిలియన్ కేజీల వరకు పొగాకు అమ్మకాలు సాగాయి. ఈ సారి 130 మిలియన్ కేజీల వరకూ కొనుగోలు చేసేందుకు బోర్డు ముందుకు వచ్చింది.

ఒంగోలు–1 కేంద్రం టాప్, కనిగిరి చివరి స్థానం:
పొగాకు కొనుగోళ్లలో జిల్లాలోని 11 వేలం కేంద్రాల్లో ఒంగోలు–1 వేలం కేంద్రంలో అత్యధికంగా 5.4 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లు జరిగాయి. కొండపి వేలం కేంద్రం 5.1 మిలియన్ కేజీలతో ద్వితీయ స్థానంలో, కనిగిరి వేలం కేంద్రం 2.5 మిలియన్ కేజీలతో చివరి స్థానంలో ఉంది.

సరాసరి ధర రూ.238.78 పలికింది



ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన పొగాకు కొనుగోళ్లలో కేజీ పొగాకు సరాసరి ధర రూ.238.78 పలికింది. కనిష్ఠ ధర రూ.205, గరిష్ఠ ధర రూ.300, ప్రారంభ ధర రూ.230 పలికింది. మొత్తం 130 మిలియన్ కేజీలు కొనుగోలు చేయాలని బోర్డు నిర్ణయించగా ఇప్పటి వరకు 42 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేశారు. ఇంకా పొగాకు కొనుగోళ్లు ఆగస్టు నెల వరకు కొనసాగుతాయి.

– ఆర్.లక్ష్మణ్‌రావు, ఆర్ఎం, టుబాకోబోర్డు, ఒంగోలు



తూర్పు చౌటపాలెంలో తెల్లవారు జామునే బారులు తీరిన ఓటర్లు

పోలింగ్‌లో దర్శి టాప్



మొత్తం ఓట్లు 2,26,370

పోలైన ఓట్లు 2,05,993

- 91 శాతం పోలింగ్ నమోదు
- రాష్ట్రంలోనే మొదటి స్థానం
- చైతన్యం చూపిన దర్శి ఓటరు
- 2019లో 90.35 శాతం నమోదు
- 2014లో 91.52 శాతం పోలింగ్

దర్శి: దర్శి ఓటర్లు మరోసారి చైతన్యం చూపారు. ఇక్కడ మూడు ఎన్నికల నుంచి రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదవుతూ వస్తోంది. దాన్ని ఈసారీ కొనసాగించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 91 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకుని రాష్ట్రంలోనే టాప్‌గా నిలిచారు. ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని రాత్రి పది గంటల వరకూ లైన్‌లోనే ఉండి ఓటు వేశారు. గత ఎన్నికల్లోనూ ఇంచుమించు ఇదే పోలింగ్ శాతం నమోదు కాగా వైఎస్సార్ సీపీ విజయపతకాన్ని ఎగురవేసింది. ఇప్పుడు కూడా ఇదే ఫలితాలు వస్తాయన్న చర్చ జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో 2,26,370 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,14,233 మంది, మహిళలు 1,12,129 మంది ఉన్నారు. వీరిలో 2,05,993 మంది ఓటు హక్కు వినియోగించుకోగా అందులో పురుషులు 1,03,765 మంది, మహిళలు 1,02227 మంది ఉన్నారు. దీంతో నియోజకవర్గంలో 91 శాతం పోలింగ్ నమోదైంది.

మహిళలకంటే 1,538 ఎక్కువ మంది పురుషులు ఓటు వేశారు. పట్టణ ప్రాంతంలో మాత్రం దర్శి అర్బన్‌లో 29,717 ఓట్లు ఉండగా, 24,219 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 82 శాతం పోలింగ్ నమోదైంది. దర్శి రూరల్ మండలంలో 43,171 మంది ఓటర్లు ఉండగా 40,016 మంది ఓటు హక్కు వినియోగించుకుని 92.69 శాతం పోలింగ్ నమోదైంది. దొనకొండ మండలంలో 37,805 మంది ఓటర్లు ఉండగా 34,848 మంది ఓటు హక్కు వినియోగించుకుని 92.21 శాతం, కురిచేడు మండలంలో 32330 మంది ఓటర్లు ఉండగా 29570 మంది ఓటేసి 91.82 శాతం, ముండ్లమూరు మండలంలో 45625 మంది ఓటర్లు ఉండగా 42342 మంది ఓటు వేసి 93.22 శాతం, తాళ్లూరు మండలంలో 37722 మంది ఓటర్లు ఉండగా 34797 మంది ఓటు హక్కు వినియోగించుకుని 91.98 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో పోలింగ్ నమోదులో మొదటి స్థానంలో ముండ్లమూరు మండలం, ఆ తరువాత వరుసగా దర్శి రూరల్, దొనకొండ, తాళ్లూరు, కురిచేడు, దర్శి అర్బన్ ఉన్నాయి. 2014లోనూ 91.52 శాతం పోలింగ్ నమోదైంది. దర్శి నియోజకవర్గంలో గత 15 సంవత్సరాల నుంచి 90 శాతానికిపై ఓటర్లు ఓట్లేసేందుకు ఆసక్తి చూపడం ఇక్కడ ప్రజల చైతన్యాన్ని రుజువు చేస్తోంది.

విజయబావుటా ఎగురవేస్తాం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఒంగోలు నియోజకవర్గంలో మరోమారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయబావుటా ఎగురవేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పాలనకు ప్రజలు మొగ్గు చూపారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎక్కువ శాతం చంద్రబాబు మేనిఫెస్టోను నమ్మలేదని ఉద్యోగ సంఘాలు తనకు తెలిపారన్నారు. బకాయిలు చెల్లించడంలో కొంత ఆలస్యం అయినా జగన్‌మోహన్‌రెడ్డి నయం అని పేర్కొన్నారన్నారు. ఏది ఏమైనా మండుటెండను సైతం లెక్కచేయకుండా తనతోపాటు ప్రయాణం చేసి కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, తనను ప్రోత్సహించిన ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల విధి నిర్వహణలో పాలుపంచుకున్న అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



దగ్ధమైన బస్సులోని సీట్లు



తుక్కుతుక్కయిన టిప్పర్ ముందు భాగం

అర్ధరాత్రి పెను విషాదం

ఒంగోలు టౌన్: ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంతూరుకు వచ్చి ఆనందంగా తిరిగి బస్సులో వెళ్తున్న ఆ కుటుంబాల్లో టిప్పర్ రూపంలో ఎదురొచ్చిన మృత్యువు పెను విషాదం నింపింది. ట్రావెల్స్ బస్సు– టిప్పర్ ఢీకొన్న ఘటనలో మంటలు ఎగసి రెండు వాహనాలు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లతోపాటు బస్సులోని ఎనిమిదేళ్ల చిన్నారి సహా నలుగురు ఆహుతయ్యారు. ఈ హృదయ విదారక ఘటన మంగళవారం అర్ధరాత్రి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ సమీపాన జరిగింది. పది మంది క్షతగాత్రులయ్యారు. కొందరు జీజీహెచ్‌లో, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అగ్ని కీలల్లో దగ్ధమైన ట్రావెల్స్ బస్సులో అవ్వా తాతలతో పాటుగా ప్రకాశం జిల్లాకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి ఖ్యాతి సాయిశ్రీ మృత్యువాతపడింది. ఖ్యాతి తండ్రి ముప్పరాజు సుబ్బారావు స్వగ్రామం దర్శి మండలం వీరాయపాలెం. సుబ్బారావు భార్య పూజ సొంతూరు చినగంజాం మండలంలోని నీలాయపాలెం. ఆ దంపతుల పుత్రిక ఖ్యాతి సాయిశ్రీ. ఖ్యాతి తాత నీలాపాలేనికి చెందిన ఉప్పుగుండూరి కాశీబ్రహ్మేశ్వరరావు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు స్వగ్రామానికి భార్య లక్ష్మితో కలిసి వచ్చారు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు కాగా పెద్ద కూతురు హైదరాబాద్‌లో ఉంటారు. చిన్న కూతురు పూజ ఒంగోలులోని సత్యనారాయణపురంలో నివాసం ఉంటారు. రెండు రోజుల పాటు సరదాగా గడిపిన బ్రహ్మేశ్వరరావు దంపతులు ఓటేసిన తరువాత హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. వెళుతూ వెళుతూ మనవరాలు ఖ్యాతికి స్కూలు సెలవులు ఉండడంతో తమ వెంట తీసుకొని బయలు దేరారు. ట్రావెల్స్ బస్సులో బుధవారం రాత్రి బయలుదేరిన కొద్దిసేపటికే ప్రమాదం జరిగింది. అవ్వా తాతలతో పాటుగా చిన్నారి ఖ్యాతి మరణించింది. ప్రమాద తీవ్రతకు అద్దంపట్టే చిత్రాలివి..



బస్సులోనే సజీవ దహనమైన వారి మృతదేహాలు



దగ్ధమైన బస్సు

గ్రూప్ వన్ ర్యాంకర్‌కు సత్కారం



రాహుల్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ టీ సురేష్

వెలిగండ్ల: ఇటీవల విడుదలైన గ్రూప్ వన్ పరీక్ష ఫలితాల్లో ఆల్‌ఇండియా ర్యాంక్ 504 సాధించి, త్వరలో ఐఏఎస్‌గా నియమితులు కాబోతూ తొలిసారి బుధవారం కనిగిరి వచ్చిన వంగేపురపు రత్నకుమార్, వయోలారాణిల కుమారుడు వంగేపురపు రాహుల్‌కు కనిగిరి నియోజకవర్గ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. వంగేపురపు రాహుల్‌కు కనిగిరి దుర్గం బాప్టిస్టు చర్చిలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చర్చి కమిటీతో పాటు వెలిగండ్ల సర్పంచ్ టి సురేష్, ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ రాహుల్‌ను సన్మానించారు.

ఉప్పుగుండూరులో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో ఈ నెల 16 తేదీ రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్లను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఒక ప్రకటనలో టోర్నమెంట్ వివరాలు వెల్లడించారు. విద్యానగర్ ఆధ్వర్యంలో జేవైఎస్, రాజేష్ ఫ్రెండ్స్ నిర్వహించే ఈ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు వరుసగా ప్రథమ రూ.40,116, ద్వితీయ రూ.30,116, తృతీయ రూ.20,116, చతుర్థ రూ.10,116 అందజేయనున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగతంగా 50 పరుగులు చేసిన క్రీడాకారుడికి మహాలక్ష్మి ఎలక్ట్రానిక్స్ వారిచే సీలింగ్ ఫ్యాన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంట్రీలకు జీ అశోక్ 8886933272, పి.మహేష్ 9966547076కు సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్ రిపేరులో ఉచితంగా శిక్షణ

ఒంగోలు టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని నిరుద్యోగ యువకులకు రూడ్‌సెట్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేరులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరక్టర్ పి.ప్రతాప్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకాలంలో అభ్యర్థులకు ఉచితంగా భోజనంతో పాటు వసతి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9573363141కు సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

వాదంపల్లి నాయకులకు తాటిపర్తి పరామర్శ



సాయి తలిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న చంద్రశేఖర్

మార్కాపురం: యర్రగొండపాలెం మండలం వాదంపల్లిలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడి మార్కాపురంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కన్నెబోయిన వెంకటసాయిని బుధవారం సాయంత్రం యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా రూ. 10 వేలు అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఓబులరెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రి సురేష్ మోకాలికి త్వరలో శస్త్ర చికిత్స

జరుగుమల్లి(సింగరాయకొండ): రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కుడి మోకాలికి శస్త్ర చికిత్స చేయనున్నట్లు పీఆర్‌ఓ బి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం మంత్రి హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. గతంలో మంత్రి సురేష్ ఎడమ కాలికి శస్త్ర చికిత్స జరిగింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంత్రి సురేష్ కొండపి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేయడంతో కుడి కాలు కూడా ఒత్తిడికి గురైందని, వైద్యులు పరీక్షించి శస్త్ర చికిత్స చేయాలని నిర్ధారించారని వివరించారు. మంత్రి సురేష్ హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకుంటారని, కావున కొద్ది రోజులపాటు నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండరని, ఈ విషయాన్ని గమనించాలని పీఆర్‌ఓ విజ్ఞప్తి చేశారు.

33 ఆర్మీ మద్యం బాటిళ్లు సీజ్



సీజ్ చేసిన మద్యం బాటిళ్లతో ఎస్సై మధుసూదన్‌రావు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన ఆర్మీ మద్యం బాటిళ్లను స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కొమరోలులోని ఓ ఇంటిలో మద్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో తనిఖీ చేశారు. 33 ఆర్మీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ప్రతిభ

ఒంగోలు: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ఫలితాల్లో స్థానిక వికాస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం చేసుకున్నారు. కొండపికి చెందిన కె.జ్యోత్స్నతేజ బైపీసీ గ్రూప్ విభాగంలో 110 మార్కులతో రాష్ట్రస్థాయిలో 115వ ర్యాంకు కైవసం చేసుకుంది. కొత్తపట్నం పల్లెపాలెంకు చెందిన చాపల నవీన్ ఎంపీసీ విభాగంలో 119 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 174వ ర్యాంకు సాధించాడు. 500లోపు 15మంది, వెయ్యిలోపు 25 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి.వీరయ్య తెలిపారు.

దర్శిలో రౌడీ మూకల మేస్త్రీ



అల్లరిమూకలను చెదరగొడుతున్న పోలీసులు



సాయంత్రం 6 గంటల తర్వాత బూత్‌లోకి అనుమతించాలని బెదిరిస్తున్న కడియాల వెంకటేశ్వర్లు

- ఎన్నడూ లేని దాడుల సంస్కృతిని దర్శికి తీసుకొచ్చిన టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి
- భర్త, రౌడీషీటర్లు, పార్టీ నాయకులతో కలిసి పోలింగ్ బూత్‌ల వద్ద హల్ చల్
- ఓటర్లతోపాటు పోలీసులను సైతం భయభ్రాంతులకు గురిచేసిన వైనం
- పచ్చ మూకను ఉసిగొల్పి వైఎస్సార్ సీపీ శ్రేణులపై రాళ్ల దాడి
- ప్రశాంతంగా ఉండే దర్శిలో చిచ్చురేపిన టీడీపీ రౌడీలు
- ఓటమి భయంతో అడుగడుగునా అరాచకాలు
- నరసరావుపేట రౌడీలు 150 మంది వచ్చారని ముందే చెప్పిన బూచేపల్లి

దర్శి: ప్రశాంతంగా ఉండే దర్శి నియోజకవర్గంలో పచ్చ మూకలు భీబత్సం సృష్టించాయి. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా వివాదాలు చోటుచేసుకున్న సందర్భాలు స్వల్ప స్థాయిలోనూ లేవు. పోలింగ్ రోజున ఎవరికి వారు ఓటు వేసి ఆ నాలుగు రోజులు పార్టీల పేరు చెప్పుకున్నా, ఆ తర్వాత అందరూ కలసి మెలసి ఉంటారు. అయితే దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ఇక్కడ అడుగు పెట్టినప్పటి నుంచి అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఎన్నికల ప్రచారంలో తరచూ అధికార వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ రోజున రౌడీలను ఉసిగొల్పి రాళ్ల దాడులు చేయించడం లక్ష్మి వైఖరి బట్టబయలైంది.

పోలింగ్‌ను అడ్డుకునేందుకు కుట్ర

ఎన్నికల్లో ఓటమిని ముందే గ్రహించిన గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త కడియాల లలిత్ సాగర్ కుట్రలకు తెరలేపారు. ముందస్తు పథకం ప్రకారం నరసరావుపేట నుంచి దర్శికి 150 మందితో కూడిన అల్లరిమూకను రప్పించారు. పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ వచ్చే బూత్‌ల వద్ద గొడవలు సృష్టించేందుకు పూనుకున్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి పోలింగ్ బూత్‌ల వద్దకు రాకుండా చేయాలనేది వారి ఉద్దేశంగా కనిపించింది. బొట్లపాలెంలో పథకం ప్రకారం అలజడి సృష్టించారు. ఆ వంకతో బూత్‌లోకి ప్రవేశించిన లక్ష్మి, తన అనుచరులు ఓట్లు ఎలా వేస్తారో వేయండంటూ కాలు మీద కాలేసి కూర్చుని బెదిరించారు. కళ్లు సరిగా కనిపించని వృద్ధురాలితో ఓటు వేయించేందుకు యువకుడిని అడ్డుకోవడంతో అక్కడే ఉన్న మహిళలంతా ఒక్కసారిగా ఎదురు ప్రశ్నించడంతో పోలింగ్ ఆపాలని బూత్ బయట ధర్నాకు దిగారు. పోలీసులు వచ్చి రౌడీ మూకలను తరిమేశారు.

లక్ష్మి భర్త కడియాల లలిత్‌సాగర్ దేవవరం సమీపంలో ఉండి బూత్ వద్దకు రౌడీ మూకను పంపి గొడవ సృష్టించారు. కర్రలతో దాడులు చేసి, రాళ్లు రువ్వి మహిళలను భయభ్రాంతులకు గురి చేసి ఓట్లు వేయకుండా అడ్డుకున్నారు. పోలీసులు వచ్చిన తరువాత వచ్చిన లలిత్ సాగర్‌ను అక్కడి జనం నిలదీశారు. ప్రశాంతంగా ఉండే దేవవరంలో గొడవలు పెట్టి తలలు పగులగొట్టి మీరు ఏం సాధిస్తారని నిలదీయడంతో అక్కడి నుంచి జారుకున్నారు.

దర్శి పట్టణంలోని కొత్తరెడ్డి పాలెం, పొదిలి రోడ్డులో బూత్‌ను టార్గెట్ చేసుకున్న పేట రౌడీలు మరోమారు రచ్చ చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత బూత్‌లోకి ప్రవేశిస్తూ నరసరావుపేటకు చెందిన రౌడీలను వెంట తీసుకెళ్లారు. ఇక్కడ పోలింగ్ నిలిపివేసి ఈవీఎంలు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఓటర్లు, పేట రౌడీలకు మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు ఏమి చేయలేక చూస్తుండిపోయారు. ఈ సమయంలో డీఎస్పీ వచ్చి అందరినీ బయటకు పంపారు. ఇక్కడ రౌడీలతో పోలీసులపై రాళ్లు రువ్వించగా వారికి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు తోడయ్యారు. పోలీసులు రక్షణ వలయంగా ఏర్పడి డీఎస్పీని బూత్‌లోకి తీసుకెళ్లాల్సి వచ్చింది. వరుస ఘటనలలో దర్శి నియోజకవర్గ ప్రజలు భీతిల్లారు. దూర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు వచ్చిన వారు కూడా ప్రయాణం వాయిదా వేసుకున్నారు.

పోలీసుల మౌనం వెనుక కారణమేంటి?

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎన్నికలకు రెండు రోజుల ముందే లక్ష్మి వైఖరిని తూర్పారబట్టారు. నరసరావుపేట నుంచి 150 మంది రౌడీలను తీసుకొచ్చారని, పోలింగ్ రోజున భీబత్సం సృష్టించేందుకు స్కెచ్ వేశారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నలకు సమాధానం లేదు. అదనపు పోలీసు బలగాలు పూర్తి స్థాయిలో రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలింగ్ బూత్‌ల్లో రచ్చ చేసిన రౌడీలను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విజయ మనదే.. ధీమాగా ఉండండి

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు దద్దాల పరామర్శ



కంబాలదిన్నెలో పార్టీ నేతలతో మాట్లాడుతున్న దద్దాల

పామూరు: కనిగిరిలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమాగా ఉండాలని, తాను అన్నివేళలా అండగా ఉంటానని ఆ పార్టీ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ భరోసా ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గత సోమవారం కంబాలదిన్నె గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన దమ్ము శ్రీనివాసులు, యాదాల అలివేలమ్మను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులపై టీడీపీ నేతల దాడులు హేయమన్నారు. దాడికి పాల్పడిన వారికి తగిన శిక్ష పడేలా చూస్తామన్నారు. అనంతరం మండల కేంద్రమైన పామూరులోని మిరియం రామారావు, గుంటుపల్లె సుబ్బరాయుడు నివాసాలకు వెళ్లి వారితో చర్చించారు. అదేవిధంగా పోలింగ్ సరళి, ఇతర అంశాలపై పార్టీ నాయకులతో చర్చించారు. ఆయన వెంట జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కందుల శ్రీనివాసరెడ్డి, అంబటి కొండారెడ్డి, జె.గోవిందయ్య, నీలం వెంకటేశ్వర్లు, రమణమ్మ, రమణయ్య, నక్కా మాల్యాద్రి, కొల్లా రమణయ్య, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, గుడిమెట్ల వేణుగోపాల్ ఉన్నారు.

ప్రజలకు తాటిపర్తి కృతజ్ఞతలు



తాటిపర్తికి ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్

యర్రగొండపాలెం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రతిక్షణం పార్టీకి అండగా నిలిచి రాత్రింబవళ్లు కష్టపడి ప్రచార కార్యక్రమాల్లో అంతా తామై వ్యవహరించిన నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు, వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, సచివాలయాల కన్వీనర్లకు, బూత్ కమిటీ సభ్యులకు ఆ పార్టీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్న నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా అక్కాచెల్లెమ్మలు, అవ్వాతాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకే సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, జగనన్న సాయంతో నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి తన వంతు పాటుపడతానని పేర్కొన్నారు. తాటిపత్రి చంద్రశేఖర్ గెలుపు ఖాయమని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆయనకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

బీభత్సం సృష్టించిన టీడీపీ నేత కారు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు





కారు ఢీకొనడంతో గాయపడిన నందకిశోర్, రామిరెడ్డి

- కల్వర్టును ఢీకొట్టిన మార్కాపురం టీడీపీ పట్టణ అధ్యక్షుడు మౌలాలి
- అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులకు తీవ్ర గాయాలు

మార్కాపురం రూరల్: అతి వేగంగా వెళ్తున్న కారు రోడ్డు పక్కన కల్వర్టు రిటెయినింగ్ వాల్‌ను ఢీకొని, ఎదురుగా వస్తున్న బైక్‌కు తగిలి బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన దరిమడుగు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కథనం మేరకు.. మార్కాపురం నుంచి కుంట వైపునకు కారులో వేగంగా వెళ్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి దరిమడుగు దాటిన తర్వాత కల్వర్టును ఢీకొట్టాడు. అదే సమయంలో కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు డి.రామిరెడ్డి, పి.నందకిశోర్‌కు గాయాలయ్యాయి. వీరు బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. కళాశాలలో పరీక్ష రాసి ఇంటికి వస్తుండగా ప్రమాదం బారిన పడ్డారు. క్షతగాత్రులను పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదం ధాటికి కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్‌కు గాయాలు



ప్రమాదానికి గురైన కారు

పెద్దారవీడు: ఎదురుగా వస్తున్న లారీని వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తహసీల్దార్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలో హనుమాన్ జంక్షన్ కుంట వద్ద బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎర్రగొండపాలెం తహసీల్దార్ సోమ్లానాయక్ కారులో మార్కాపురం నుంచి ఎర్రగొండపాలెం బయల్దేరారు. త్రిపురాంతకం నుంచి ఇటుకల లారీ కంభం వైపు వెళ్తోంది. హనుమాన్ జంక్షన్ కుంట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న తహసీల్దార్ సోమ్లానాయక్ తలకు గాయాలయ్యాయి. కారులో సర్వేయర్ దిలీప్, సిబ్బంది ఉన్నారు. వారికి ప్రమాదం తప్పింది. వెంటనే సిబ్బంది మరో కారులో సోమ్లానాయక్‌ను చికిత్స కోసం మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దర్శిలో ఒకరికి తీవ్ర గాయాలు

దర్శి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని గాంధీ నగర్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కుంచేపల్లి గ్రామానికి చెందిన తంగిరాల ఏలేసు తన మోటారు సైకిల్‌పై దర్శికి వస్తున్నాడు. గాంధీ నగర్ సమీపానికి వచ్చేసరికి ఏలేసు ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వస్తున్న కారు ఏలేసు మీదుగా వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ఏలేసును దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

ఓటర్లకు ఎమ్మెల్యే కేపీ కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులు, శ్రేయోభిలాసులకు వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. జగనన్న ఆశీస్సులతో గిద్దలూరు నియోజకవర్గంలో మంచి మెజార్టీతో గెలిపించేందుకు ఇచ్చిన సహకారం ఎన్నటికీ మరువలేనన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా గిద్దలూరులోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు తరలివెళ్లి ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఫిజికల్ డైరెక్టర్‌కు డీఈఓ అభినందన



శ్యామలాదేవిని అభినందిస్తున్న డీఈఓ

మార్కాపురం టౌన్: మార్కాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డి.శ్యామలాదేవిని డీఈఓ సుభద్ర బుధవారం ఒంగోలులో ప్రత్యేకంగా అభినందించారు. శ్యామలాదేవి ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో భారతదేశం తరఫున పాల్గొని పతకాలు సాధించారు. దీంతోపాటు ఆమె స్వయంగా ప్రభుత్వ పతకాలపై, కరోనాపై పాటలు రాసి పాడారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి శ్యామలాదేవి విజయాల గురించి నివేదిక పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్యామలాదేవి 2023లో కొరియాలో నిర్వహించిన ఆసియా మాస్టర్స్ గేమ్స్‌లో 80 మీటర్ల హార్డిల్స్ ట్రిపుల్ జంప్‌లో పతకాలు సాధించారు.

వేడుకగా చెన్నకేశవస్వామి కల్యాణం



కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. బుధవారం చెన్నకేశవస్వామి కల్యాణం కనుల పండువగా సాగింది. కల్యాణ ఉభయదాతలుగా మద్దూరి, చెన్నారెడ్డి, చాగంరెడ్డి, గంగవరపు కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. అలాగే గరుడసేవ కార్యక్రమానికి ఉభయదాతలుగా దమ్మాలపాటి, ముత్యాల, అవిసినేని, గంగవరపు కుటుంబాల వారు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.